క్లుప్తంగా

గోవా అవతరణ దినోత్సవంలో 'రాకేష్' విద్యార్థులు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాజ్‌భవన్‌లో నిర్వహించిన గోవా అవతరణ దినోత్సవంలో కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొనే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. మంగళవారం గోవా అవతరణ దినోత్సవం పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో వేడుకలు నిర్వహించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ సమక్షంలో రాకేష్ విద్యార్థులు ఎండీ. వజీహ, తేజస్వి, షేక్ హసీనా, యు.కల్యాణి గోవా సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం గవర్నర్‌తో విద్యార్థులకు గ్రూప్ ఫొటో దిగే అవకాశం కలిగింది. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు రమేష్, సాధిక, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆంజనేయస్వామి కల్యాణం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారి పేటలోని విజయదుర్గ రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, మూలవిరాట్‌లకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని సువర్చల సమేత ఆంజనేయస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో కల్యాణోత్సవం జరగగా, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం 4 గంటలకు శ్రీచక్రార్చన, 6 గంటలకు విజయదుర్గ, రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది.

దుర్గగుడి ఘాట్‌రోడ్డులో కౌంటర్ల తనిఖీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఘాట్ రోడ్డులోని ప్రసాదాలు, పవిత్ర సారె, దేవస్థాన కొబ్బరి కాయల కౌంటర్, పొంగలి షెడ్‌లను ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు తనిఖీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం కౌంటర్ల వద్దకు చేరుకున్న చైర్మన్ రాంబాబు అక్కడి సిబ్బంది పని తీరును పరిశీలించారు. భక్తులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి వారు అడిగిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఘాట్‌రోడ్డులోని మంచినీటి వాటర్ ప్లాంట్‌ను పరిశీలించిన చైర్మన్ చల్లని తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోనూ, రాజగోపురం ఎదుట చంటి బిడ్డలకు తల్లులు పాలు ఇచ్చేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. చైర్మన్ వెంట పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు పాల్గొన్నారు.

కాలువల ప్రక్షాళన పనుల పురోగతిపై సమీక్ష

భవానీపురం(విజయవాడపశ్చిమ): మిషన్ క్లీన్ (ఎంసీకేజీసీ)లో భాగంగా నగరంలోని మూడు కాలువల ప్రక్షాళన పనులను ప్రారంభించిన నేపథ్యంలో ఆయా పనుల పురోగతిపై వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి చాంబర్‌లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కాలువల ప్రక్షాళనకు నగరంలోని మూడు కాలువలకు ముగ్గురు ఏఎంఓహెచ్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్లు చెప్పారు. ఒక్కో కాలువ శుభ్రపరచడానికి 200 మంది పారిశుద్ధ్య కార్మికులను కేటాయించామని తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల పురోగతి, అవగాహనకు స్పెషల్ డ్రైవ్ చేపట్టడంతోపాటు ఇంటింటికీ ప్రచారం చేయాలని ఆమె ఆదేశించారు. వినియోగదారుల నుంచి యూజర్ చార్జీల వసూళ్లను మెరుగుపరచడానికి స్పెషల్ డ్రైవ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇంజినీరింగ్, హార్టీకల్చర్, శానిటేషన్ డిపార్ట్‌మెంట్‌ల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శివకామేశ్వరి పీఠం వార్షికోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం వార్షికోత్సవం మంగళవారం రెండోరోజుకు చేరుకుంది. ఆలయంలోని శ్రీ నీలకంఠేశ్వరస్వామి, శివకామేశ్వరి, వినాయకునికి శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.

రూ.61 లక్షలతో కమ్యూనిటీ హాల్

సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వెలంపల్లి



రోటరీనగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ మాధురీ లావణ్య తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని రోటరీనగర్‌లో రూ.61 లక్షల వ్యయ అంచనాతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ (గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్)కు వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు,మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం డివిజన్ పరిధిలో సుమారు రూ.60 లక్షల వ్యయ అంచనాతో నిర్మించిన బృందావన్ కాలనీ, న్యూ భగత్‌సింగ్‌నగర్, బ్రహ్మయ్య కాలనీ రోడ్లను ప్రారంభించారు.

వెలంపల్లి మాట్లాడుతూ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులు, కొన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ ఆవశ్యకతను స్థానిక కార్పొరేటర్ మాధురి లావణ్య తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గంలో అనేక డివిజన్లలో పలు అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేశామని తెలిపారు. అన్ని డివిజన్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేశామని, అక్కడి ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, వీఎంసీ ఈఈ నారాయణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, ముత్తా వాసు, ముత్యాల రాంబాబు, బైపినేని కోటేశ్వరరావు, బోర మల్లేశ్వరరెడ్డి, డాక్టర్ రత్నమాచారి, దబ్బాడ రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలి



'మంచికంటి'కిస్వాగతం పలుకుతున్న కొల్లూరి, వివిధ సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: గ్రంథాలయ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని భాష మనుగడకు ప్రతి ఇల్లూ ఉద్యమ కేంద్రం కావాలని శాంతివనం వ్యవస్థాపకుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మరో గ్రంథాలయ ఉద్యమం ప్రచార యాత్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో పర్యటిస్తూ మంగళవారం నగరానికి చేరుకున్నారు. పలు ప్రాంతాల్లో ప్రచార యాత్ర చేశారు. లెనిన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మంచికంటి మాట్లాడుతూ సాహిత్య సామాజిక చైతన్యానికి గ్రంథాలయ ఉద్యమం చేయాల్సిన అవసర ముందున్నారు. ఈనెల 19న ఒంగోలులో యాత్ర ప్రారంభించానని ఇప్పటికి 10 జిల్లాల్లో చైతన్య యాత్రలు నిర్వహించానని తెలిపారు. మొత్తం రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ప్రచార యాత్ర చేస్తానని తెలిపారు. ఆయన మాట్లాడుతూ సత్ సాహిత్యం చదవడం పిల్లలకు అలవాటు చేయాలన్నారు. ప్రభుత్వం గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సెల్‌ఫోన్ కారణంగా యువత చదువులను నిర్లక్ష్యం చేస్తోందని దానికి దూరంగా ఉండాల్సిన అవసముందన్నారు. మంచికంటికి.. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, యువ కవి అనిల్‌డ్యానీ, కవయిత్రి మందరపు హైమావతి, సాహితీ ప్రముఖులు మంజరి లక్ష్మి, కోయ వెంకటేశ్వర్లు, పవన్ స్వాగతం పలికారు. యాత్ర చేస్తున్న మంచికంటి కృషిని అభినందించారు.

జైనుల సమస్యలపై సీఎంకు వినతిపత్రం



ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని అందిస్తున్న మనోజ్ కొఠారి

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): జైనుల సమస్యలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించినట్లు ఏపీ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి మంగళవారం తెలిపారు. విజయవాడకు వచ్చిన సీఎంను కలిసి వినతిపత్రాన్ని అందించినట్లు పేర్కొన్నారు. జైన్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనను నియమించడపై ఆయనకు కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు.

మెరుగైన సేవలు.. ఉద్యోగ భద్రత ..



కేక్ కోస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): సంక్షోభంలో ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను గట్టెక్కించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఆర్టీసీ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఆర్టీసీ హౌస్‌లోని ఆమె కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తాతినేని పద్మావతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో భాగంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించారన్నారు. వేల కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకున్న ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితిలో దాన్ని ప్రభుత్వంలో విలీనం చేసి వారికి జీతాలు ఇవ్వడమే కాకుండా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఏసుదానం మాట్లాడుతూ దేశంలోనే రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. అనంతరం కేక్ కోశారు. కార్యక్రమంలో ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు,అబ్రహం, రామకృష్ణా, ముక్తేశ్వరరావు, యాకొబ్, దాసు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం



సచివాలయ వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అంద చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. వలంటీర్లకు వందనంలో భాగంగా మంగళవారం 34వ డివిజన్ కేదారేశ్వరపేటలోని వీఎంసీ కల్యాణ మండపంలో వలంటీర్ల సత్కార కార్యక్రమం జరిగింది.

ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. 34, 35, 55, 56 డివిజన్ల సచివాలయాల్లో సేవలు అందిస్తున్న వార్డు వలంటీర్లను ఘనంగా సత్కరించి సేవా మిత్ర, సేవా రత్నా, సేవా వజ్ర పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల, కార్పొరేటర్లు బలసాని మణెమ్మ, యలకల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నాగేశ్వరమ్మ సేవలు స్ఫూర్తిదాయకం



డాక్టర్ నాగేశ్వరమ్మను సత్కరిస్తున్న వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): చర్మవ్యాధుల నిపుణురాలిగా డాక్టర్ ఎస్.నాగేశ్వరమ్మ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి డెర్మటాలజీ విభాగాధిపతిగా పని చేస్తూ బుధవారం పదవీ విరమణ చేయనున్న డాక్టర్ ఎస్.నాగేశ్వరమ్మను ఆ విభాగానికి చెందిన వైద్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. వైద్య కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ 1999లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సర్వీసులో చేరిన ఆమె రెండున్నర దశాబ్దాల పాటు సేవలు అందించారన్నారు. గుంటూరు మెడికల్ కళాశాలలో అనేక పదవుల్లో విధులు నిర్వహించారన్నారు.

చర్మవ్యాధులపై జరిపిన పరిశోధనలకు తుమ్మల రామబ్రహ్మం అవార్డును రెండుసార్లు అందుకున్నట్లు తెలిపారు. గతేడాది ఏప్రిల్‌లో విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలకు బదిలీపై వచ్చిన ఆమె ఇక్కడ హెచ్‌ఓడీగా విశేష సేవలు అందించినట్లు తెలిపారు. సన్మాన గ్రహీత డాక్టర్ నాగేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో వైద్యురాలిగా పనిచేయడం ఎంతో సంతృప్తి నిచ్చిందని, డెర్మటాలజీ విభాగం ఫ్యాకల్టీ అధ్యక్షురాలిగా అనేక సందర్భంగా కాన్ఫరెన్స్‌లు నిర్వహించి మన్ననలు పొందినట్లు తెలిపారు. చర్మవ్యాధులు సమస్యలు ఉన్నవారు 98491 43461లో సంప్రదించవచ్చని చెప్పారు. డెర్మటాలజీ విభాగానికి చెందిన డాక్టర్ సౌమ్య, డాక్టర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు వలంటీర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వీఎంసీ పరిధిలోని 125 వార్డుల్లో వలంటీర్ల ఎంపికకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. సత్యనారాయణపురంలోని జోనల్ కమిషనర్ కార్యాలయం సర్కిల్–2లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని వీఎంసీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇతర వివరాలకు విజయవాడ నగరపాలక సంస్థలోని స్పెషల్ ఆఫీసర్ (వార్డ్ సెక్రటేరియట్స్) లేదా వార్డ్ సెక్రటేరియట్ స్పెషల్ సెల్ ఫోన్ నెంబర్ 8185933187లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

1,200 గ్రాముల గంజాయి స్వాధీనం

గుణదల(విజయవాడ తూర్పు): మారుతీనగర్‌లో గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను మాచవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో నిషా బార్ అండ్ రెస్టారెంట్ పక్కన సూర్యారావుపేట పున్నమితోటకు చెందిన గుడిగుంట్ల వంశీకుమార్, కేదారేశ్వరపేటకు చెందిన తిరుగుళ్ల రమేష్ 1,200 గ్రాముల గంజాయి కలిగి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. వెంటనే నిందితులను అదుపులోకి తీసుకుని ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్ చేసి ఉన్న గంజాయిని స్వాధీనం చేస్తున్నారు. జల్సాలకు అలవాటు పడి, సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయానికి అలవాటు పడినట్లు పోలీసుల విచారణలో నిందితులు అంగీకరించారు. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంకు చెందిన జానీ అనే వ్యక్తి నుంచి ఇటీవలే కేజీన్నర(1,500 గ్రాములు) గంజాయిని కొనుగోలు చేశామని, అందులో 300 గ్రాములు వేరే వ్యక్తులకు విక్రయించినట్లు నిందితులు అంగీకరించారు. దీంతో నిందితుల వద్ద ఉన్న 1,200 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ గుణరాము తెలిపారు. నిందితులు ఇద్దరినీ న్యాయ స్థానంలో మంగళవారం హాజరుపర్చినట్లు చెప్పారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులు వంశీకుమార్, రమేష్‌ను రిమాండ్‌పై రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపినట్లు వివరించారు.

అంకిత భావంతో విధులు

ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు



రామారావుకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆర్టీసీ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. విద్యాధరపురంలోని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో వెల్డర్‌గా పని చేస్తున్న ఉద్యోగి టీవీ రామారావు పిల్లర్ రాడ్ స్థానంలో అల్యూమినియం స్క్రాప్ స్ట్రిప్స్‌ను వినియోగించి సంస్థకు ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జోనల్ వర్క్‌షాప్‌లో జరిగిన కార్యక్రమంలో ఈడీ వెంకటేశ్వరరావు వెల్డర్ రామారావును అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని కోరారు. కార్యక్రమంలో వర్క్స్ మేనేజర్ వాణిశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దాసాంజనేయ ఆలయంలో కూలిన ధ్వజస్తంభం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహంతీపురంలోని పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని దాసాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం మంగళవారం ఈదురుగాలులకు కూలింది. ధ్వజస్తంభం కూలి విద్యుత్ వైర్లపై పడి అటు నుంచి ఆలయ గోడ పక్కగా వచ్చి నిలిచింది. దీంతో కొంతసమయం విద్యుత్ సరఫరాకు విఘాతం కలిగింది. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్వామి వారి దయతో ఎవరికీ ఏమి కాకుండా అంత పెద్ద ధ్వజస్తంభం పక్కకు తీసుకొచ్చి పెట్టినట్లుగా పడిందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. కళాశాల యజమాన్యం వెంటనే ప్రత్యేకంగా అర్చకులను ఆహ్వానించి ప్రాయశ్చితం చేయించి తాత్కాలిక ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు.

ఆత్మీయ స్వాగతం









సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు మంగళవారం నగరంలోని నిర్మల్‌హృదయ్ భవన్ ప్రారంభోత్సవానికి విచ్చేశారు. వారికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టీకే రాణా, డీసీపీ విశాల్‌గున్ని, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు పుష్పగుచ్ఛంఇచ్చి స్వాగతం పలికారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా

న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి



మొబైల్ కోర్ట్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సర్కిల్– 3 కార్యాలయంలో ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్ట్‌లో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కోర్ట్ న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి మొబైల్ కోర్ట్ నిర్వహించారు. పటమటలోని సర్కిల్–3 కార్యాలయ పరిధిలో కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై 'పశ్చిమ'లోని వివిధ డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 26 కేసులకు సంబంధించిన వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ట్రేడ్‌లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న వ్యక్తులు, పశువులను విచ్చలవిడిగా రోడ్లపైకి వదిలివేసే వారు, రోడ్లపై చెత్త వేసేవారికి న్యాయమూర్తి విజయ్ కుమార్ రెడ్డి రూ.11,270 జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా మరోసారి వ్యవహరిస్తే జరిమానా తప్పదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వీధుల్లో జనావాసాల్లోకి వస్తున్న పందులపై తీసుకునే చర్యల్లో భాగంగా పందుల పెంపకందారులపై చార్జిషీట్లను మొబైల్ కోర్ట్‌లో దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● ఊరూవాడా సంబరం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సంబరాలు జరిగాయి. నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం రాజ్యసభ్యుడు అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి , మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు కేక్ కోశారు. –గాంధీనగర్(విజయవాడ్ సెంట్రల్)

హ్యాండ్‌బాల్‌లో కేబీఎన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వచ్చే నెల.. ఢిల్లీలో జరిగే జూనియర్ (ఎస్‌జీఎఫ్) హ్యాండ్‌బాల్ పోటీలకు తమ కళాశాల విద్యార్థులు హాజరుకానున్నట్లు కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ కళాశాల అత్యంత ప్రతిభ కనబరిచి పలు బహుమతులను అందుకుంటున్న విషయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగే పోటీలకు ఏపీ తరఫున తమ ఇంటర్మీడియట్ విద్యార్థులు అరవింద్, సత్య, శ్రావణి హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రరావులను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అభినందించినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

కొత్తపేట సీఐ సుబ్రహ్మణం



వాగు సెంటర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు కొండ ప్రాంతంలో మంగళవారం విజబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం, సెక్టార్ ఎస్ఐ, పోలీసులు సిబ్బంది వాగు సెంటర్‌లోని కీలక ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి శాంతిభద్రత పరిస్థితులపై ఆరా తీశారు. వాగు సెంటర్, వడ్డెర కల్యాణ మండపం, నాగేంద్ర స్వామి పుట్ట, వాటర్ ట్యాంక్ రోడ్లలో పర్యటించారు. పెద్దలు సాయంత్రం వేళ స్థానిక పరిస్థితులను సీఐ సుబ్రహ్మణ్యానికి వివరించారు. వాహనాల్లో పెట్రోల్ చోరీ ఎక్కువగా జరుగుతోందని, దీన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికంగా ఎవరైనా యువకులు మహిళలను ఇబ్బందులకు గురి చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా వెంటనే పోలీస్ స్టేషన్, కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఉపేక్షించేది లేదన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
✆ 90102 10386
Office mail : sakshiads@gmail.com